క్లుప్తంగా

అంబులెన్స్ ప్రారంభం



గద్వాల క్రైం: అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను గురువారం జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ కిశోర్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో రోగులను క్షణాల్లో ఆస్పత్రులకు తీసుకువచ్చే 108, 102 వాహనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రభుత్వాసుపత్రిలో నిరంతరం అత్యవసర సేవల కోసం ప్రభుత్వం అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ వాహనం ఉండాలనే లక్ష్యంతో జిల్లా ఆస్పత్రికి కొత్త వాహనం కేటాయించిందన్నారు. జిల్లాలో 19 అంబులెన్స్‌లు సేవలు అందిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు వృశాలి, జిల్లా కో ఆర్డినేటర్ రాఘవేంద్ర, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మొక్కలు పెరిగేలా చూడాలి



మానవపాడు: ఉపాధి హామీ పథకంలో నాటిన మొక్కలన్నీ ఏపుగా పెరిగేలా చూడాలని ఎంపీడీఓ రమణారావు వాచర్లకు సూచించారు. మండలంలోని చంద్రశేఖర్‌నగర్, కలుకుంట్లలో నాటిన మొక్కలను ఎంపీడీఓ శుక్రవారం పరిశీలించారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులను గుర్తించి, ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కార్యదర్శులకు సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున మొక్కలకు నీళ్లు ఎక్కువగా పోసి అన్ని మొక్కలు పచ్చగా ఉండేలా చూడాలని ఆదేశించారు. ఎంపీడీఓ వెంట కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

వాల్మీకి జయంతిని జయప్రదం చేయండి



శాంతినగర్: అలంపూర్ నియోజవకవర్గంలో శనివారం నిర్వహించే వాల్మీకి జయంతి వేడుకలకు జయప్రదం చేయాలని వాల్మీకి ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు వడ్డేపల్లి పుర పరిధిలోని పైపాడులో శుక్రవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వాల్మీకి జయంతి అంటే వాల్మీకి కులంకు సంబంధించిన కార్యక్రమం కాదని, రామాయణ గ్రంథ రచయిత, రామున్ని ఆరాధిస్తూ వాల్మీకి రామాయణాన్ని రచించాడని, వాల్మీకి మహర్షి అందరివాడన్నారు. జయంతి అందరి పండుగలా చేసుకోవాలని కోరారు. సమావేశంలో శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రాముడు, మద్దిలేటి, సంజి, మధు, రామకృష్ణ, రాజు, గోకారి, నాగరాజు, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

మానవపాడు: జాతీయ రహదారిపై రెండు కార్లు ఢీకొన్న ఘటన శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే విజయ్ తన కారులో కర్నూల్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. శివకుమార్ కర్నూల్ నుంచి విజయ్ కారు వెనకాల వెళ్తున్నాడు. జల్లాపురం సమీపంలోని ఆర్టీఏ చెక్‌పోస్టు సమీపంలోకి రాగానే విజయ్ కారు నెమ్మదిగా అయ్యింది. వెనకాల వస్తున్న శివకుమార్ కారు వేగాన్ని అదుపు చేయలేకపోవడంతో విజయ్ కారును ఢీకొట్టాడు. దీంతో ఇద్దరి కార్లు బాగా దెబ్బతిన్నాయి. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

మరమ్మతులు చేపట్టండి

అలంపూర్ రూరల్: మండలంలోని కాశీపూర్ వెళ్లే రహదారి మరమ్మతులకు నోచుకోక తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పడి, మలుపుల వద్ద రోడ్డు మొత్తం దెబ్బతింది. అలంపూర్ నుంచి కర్నూల్‌కు తక్కువ దూరం కావడంతో ఎక్కువగా వాహనదారులు ఈ దారిలో నిత్యం తిరుగుతుంటారు. కొంచెం అదుపు తప్పి వాహనం నడిపితే చాలు ప్రమాదం బారిన పడాల్సిందేనని కాశీపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించండి

మల్దకల్: మండలంలోని నీలిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో ఆవరణలోకి పశువులు, పందులు, మేకలు సంచరిస్తూ అపరిశుభ్రంగా చేస్తున్నాయని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల పక్కన రహదారి ఉండటంతో విద్యార్థులు రోడ్లపైకి వచ్చే సమయంలో వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే సంఘటనలు ఉన్నాయని, అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మాణం చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

మరమ్మతులెప్పుడో..?



వడ్డేపల్లి మండలం జూలెకల్–జూలెకల్ స్టేజి రహదారి

- గుంతలమయమైన మారుమూల గ్రామాల రోడ్లు
- కంకరతేలిన పట్టించుకోని వైనం
- బీటీ రోడ్లకు మట్టితో మరమ్మతులు

శాంతినగర్: గ్రామీణ రోడ్లకు మహర్దశ అంటూ గొప్పలు చెప్పుకోవడమే తప్పా ఆదిశగా అభివృద్ధికి నోచుకోవడం లేదని నియోజకవర్గ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో 134 గ్రామాలు ఉండగా, సుమారు 40 గ్రామాలకు రోడ్డు సౌకర్యం సరిగా లేదు. గతంలో వేసిన బీటీ రోడ్లు పాడైపోయాయి. కొన్ని గ్రామాలకు మట్టి రోడ్లు ఉండగా, మరికొన్ని గ్రామాలకు కంకరపరిచి వదిలేశారు. దీంతో వర్షాకాలంలో ఆయా గ్రామాలకు వెళ్లాలంటే గుంతలమయమైన రోడ్లలో నీరు నిలిచి ఇబ్బందికరంగా ఉంటుందని ప్రయాణికులు వాపోతున్నారు.

మండలాల్లో రోడ్ల దుస్థితి

నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండలం జూలెకల్–జక్కిరెడ్డిపల్లి, పైపాడు స్టేజీ–పైపాడు, శాంతినగర్–కోయిల్‌దిన్నె, అయిజ మండలం వెంకటాపురం–మాన్‌దొడ్డి, తుపత్రాల–మేడికొండ, ఉప్పల, బింగిదొడ్డి, ఎక్లాస్‌పురం, దేవబండ, గుడిదొడ్డి–యాపదిన్నె, తుపత్రాల–ఉత్తనూరు, మానవపాడు మండలం కలుకుంట్ల–మానవపాడు, చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు, గోకులపాడు, చండూరు, జల్లాపురం, ఉండవెల్లి మండలం జాతీయరహదారి నుంచి ఉండవెల్లి, మార మునగాల, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు, శేరిపల్లి, బైరాపురం, అలంపూర్, ఇటిక్యాల, రాజోళి మండలంలో తుమ్మిళ్ల–మాన్‌దొడ్డి, పెద్దధన్వాడ–మాన్‌దొడ్డి, పచ్చర్ల–మాన్‌దొడ్డి, ఎర్రవల్లి మండలంలోని గార్లపాడు రోడ్లు అధ్వానంగా మారాయి.

ప్రమాదాల బారిన ప్రజలు

ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు ప్రయాణానికి నరకంగా మారడంతో నిత్యం ఏదో ఓ దారిలో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కొందరు క్షతగాత్రులు కాగా మరికొందరు ప్రాణాలు వదులుతున్నారు. అంతేగాక రహదారుల మధ్యలో ఉన్న కల్వర్టులు, వంతెనల వద్ద సరైన రోడ్లు, సూచిక బోర్డులు లేక ప్రమాదాల మధ్య ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.

శంకుస్థాపనలకే పరిమితం

నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులకు శంకుస్థాపనలు చేసి వదిలేశారని ప్రజలు వాపోతున్నారు. జూలెకల్–జక్కిరెడ్డిపల్లి, గుడిదొడ్డి–యాపదిన్నె తదితర గ్రామాలకు రూ.కోట్లలో నిధులు మంజూరయ్యాయని, శిలాఫలకాలు ఏర్పాటు చేసి వదిలేశారని, రోడ్లు ఎప్పుడు వేస్తారో తెలియడంలేదని ప్రజలు వాపోతున్నారు.

వానాకాలంలో వెళ్లలేం..



మా గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. అడుగడుగునా రోడ్లు గుంతలు పడ్డాయి. పొలాలకు బైక్‌లపై వెళ్లలేని దుస్థితి ఉంది. కాలినడకన వెళ్తున్నాం. త్వరగా కొత్తగా బీటీ రోడ్లు, పాడై పోయిన రోడ్ల స్థానంలో రెన్యూవల్ వేసి ఇబ్బందులు తొలగించాలి.

– సంజీవనాయుడు, గోకులపాడు, మానవపాడు మండలం

కంకరమయమైంది



జూలెకల్ నుంచి స్టేజి వరకు ఉన్న బీటీ రోడ్డు కంకర తేలి బైక్‌లు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇటీవల శనిగపల్లి నుంచి జూలెకల్ వరకు బీటీ వేశారు. మా గ్రామం నుంచి స్టేజి వరకు వేయకపోవడంతో కాలినడకన వెళ్లే వారు కింద పడి గాయాలపాలైన ఘటనలు ఉన్నాయి. బీటీ రోడ్డు మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలగించాలి.

– తిమ్మప్ప, జూలెకల్, వడ్డేపల్లి మండలం

నాలుగు రోడ్లు మంజూరు

అలంపూర్ నియోజకవర్గంలో ఇబ్బందికరంగా ఉన్న రోడ్లకు ప్రతిపాదనలు పంపాం. వాటిలో నాలుగు రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. ఇటీవల ఇటిక్యాల–ఉదండాపురం, కోయిల్‌దిన్నె–వల్లూరు రోడ్లు వేయించాం. జూలెకల్–తుమ్మిళ్ల, చిన్నధన్వాడ, పెద్ద ధన్వాడ రోడ్లకు టెండర్లు పిలిచాం. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు మొదలుపెడతాం.

– ఆంజనేయులు, డీఈ, పంచాయతీ రాజ్‌శాఖ

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం



భవనాన్ని కూల్చుతున్న సిబ్బంది

అయిజ: పట్టణంలో అనుమతులు లేకుండా నిర్మించిన ఇళ్లను, వ్యాపార సముదాయాల భవనాలను, ఇతర కట్టడాలను కూల్చివేస్తామని మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ అన్నారు. శుక్రవారం పట్టణంలో రాయచూర్– కర్నూల్ రోడ్డు సమీపంలో అనుమతి లేకుండా నిర్మించిన భవనాలను పాక్షికంగా కూల్చివేశారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వద్ద 11 నిర్మాణాలకు అనుమతులు తీసుకుని 13 నిర్మాణాలు చేపట్టారని, అనుమతి లేని రెండు నిర్మాణాలు (8 గదులను) పాక్షికంగా కూల్చివేశామని తెలిపారు. పట్టణంలో అనేక చోట్ల అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టారని వాటి జాబితా కలెక్టర్ కార్యాలయానికి పంపుతామని అన్నారు. ఆదేశాల ప్రకారం వాటన్నింటిని త్వరలోనే కూల్చివేస్తామని పేర్కొన్నారు. కమిషనర్ వెంట ఏఈ గోపాల్, సిబ్బంది, పోలీస్ బృందం పాల్గొన్నారు.

కుటుంబ పాలనలో అభివృద్ధి శూన్యం



వృద్ధులతో మాట్లాడుతున్న సరిత

గద్వాల అర్బన్: ఒకే కుటుంబ పాలనలో నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి చెందలేదని జెడ్పీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని మదనపల్లి, శెట్టి ఆత్మకూర్‌లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ఒక్కటేనని, కుటుంబ పాలనలో గ్రామాల్లో రోడ్లు, పాఠశాలలు, మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాసంక్షేమం, అభివృద్ధి సాధ్యమని, తాము అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని, తనను ఆశీర్వాదించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ చైర్‌పర్సన్ క్యాంపు కార్యాలయంలో ధరూర్ మండలంలోని మన్నాపురం, పెద్దపాడు, గట్టు మండలంలోని గొర్లఖాన్‌దొడ్డి, తారపురం, గద్వాల మండలంలోని కొత్తపల్లి, మల్దకల్ మండలంలోని మంగంపేటకు చెందిన బీఆర్ఎస్, బీజేపీలకు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని జింకలపల్లి పంచాయతీని శుక్రవారం ఎంపీడీఓ రాఘవ సందర్శించారు. తాగునీరు, విద్యుత్, సరైన వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను సందర్శించి చిన్నారులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని తెలిపారు. ప్రతి రోజు పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట కార్యదర్శి రాధిక తదితరులు ఉన్నారు.

భరోసా ఇచ్చేందుకే ఫ్లాగ్ మార్చ్



అయిజలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు



రాజోళి మండలం తుమ్మిళ్లలో కవాతు చేస్తున్న పోలీసులు

అయిజ: ఎన్నికల సందర్భంగా ప్రజల్లో నెలకొన్న భయాలను తొలగించేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు అలంపూర్ సీఐ శివశంకర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి పాతబస్టాండ్, కొత్తబస్టాండ్‌తోపాటు ప్రధాన రోడ్లపై కొనసాగింది. పోలీసులు మండలంలోని మేడికొండ, ఉప్పలలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేష్ కుమార్, ఐటీబీపీ బృందం పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

రాజోళి: ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు కాకుండా, ప్రతి ఓటరు ధైర్యంగా ఓటు వేసేందుకు పోలీసుల అండ ఉంటుందని ఎస్ఐ ఖాదర్ భాషా తెలిపారు. మండల కేంద్రంతో పాటు, మాన్‌దొడ్డి, తుమ్మిళ్లలో ప్రత్యేక బలగాలతో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ఎవరి ప్రలోభాలకు లొంగకుండా, భయపడకుండా ఓటు వేయాలని దాని కోసం మీ వెనుక పోలీసులు ఉన్నారని ఎస్ఐ అన్నారు. గ్రామాల్లో ఎవరూ ఏ కారణం చేతనైనా ఓటు వినియోగించుకోవడంలో నిర్లక్ష్యం వహించవద్దని తెలిపారు.

2న సర్వసభ్య సమావేశం

కేటీదొడ్డి: మండల కేంద్రంలో నవంబర్ 2న రైతువేదికలో ఉదయం 11 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మోహిద్దీన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కరువు ప్రాంతాలుగా ప్రకటించండి

గద్వాల అర్బన్: వర్షాలు లేక పంటలు ఎండిపోయిన చోటును కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు పెట్టుబడి పెట్టి వర్షాలు లేక పంటలు ఎండిపోయి నష్టపోయారన్నారు. యాసంగిలో క్రాప్ హాలిడే ప్రకటించి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.50వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఖాజమైనుద్దీన్, సత్యారెడ్డి తదితరులు ఉన్నారు.

పాలస్తీనాపై దాడులను ఖండించాలి: ఎంఐఎం

గద్వాల అర్బన్: పాలస్తీనాపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడైనా అన్యాయం జరిగితే వాటిపై మానవ సమాజం స్పందించాలని, పాలస్తీనా సంఘటనపై మేధావులు, విద్యావంతులు, యువత స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇజ్రాయెల్ వస్తువులను కొనుగోలు చేయరాదని, కేంద్ర ప్రభుత్వం ఇజ్రాయేల్ దేశంతో వ్యాపార ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అల్తాఫ్ హుస్సేన్, జాకీర్ హుస్సేన్, రఫీ, ఫరూక్ సాబ్, చాంద్ పాష, ఇమాముద్దీన్ తదితరులు ఉన్నారు.

బీఫాం వచ్చేది మనకే: ఎమ్మెల్యే అబ్రహం

ఎర్రవల్లిచౌరస్తా: ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ వీడే ప్రసక్తే లేదని, తప్పకుండా పార్టీ బీఫాం వచ్చేది తనకేనని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రజలంతా తమ వెంటే ఉన్నారని.. కావాలనే కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం కేసీఆర్‌పై తనకు పూర్తి నమ్మకం ఉందని కార్యకర్తలు ఎవరూ కూడా అధైర్యపడొద్దని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ప్రలోభాలకు గురికావద్దని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రజలు, రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రిని చేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే సీఎం ఆదేశాల మేరకు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి మరోసారి భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిచి సీఎంకు కానుకగా ఇద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహేశ్వరెడ్డి, జయచంద్రారెడ్డి, గుమ్మాగోవర్ధన్, కృష్ణసాగర్, మల్లేష్, నీలి శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్రహం

డ్రై డే పాటిస్తే వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

రాజోళి: ఫ్రైడేను డ్రైడేగా పాటిస్తే వ్యాధులు దూరమవుతాయని మండల పీహెచ్‌సీ సిబ్బంది తెలిపారు. శుక్రవారం మండలంలోని ముండ్లదిన్నెలో డ్రైడే నిర్వహించారు. సిబ్బంది ప్రతి ఇంటికి తిరుగుతూ.. ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఇళ్ల వద్ద పాతబడిన సామాను, టైర్లు, తొట్టిలలో నీరు నిల్వ ఉంచడం వల్ల దోమల వ్యాప్తి చెందడంటతో పాటు, వ్యాధులు కలిగిస్తాయని తెలిపారు. ఇళ్లలోని ప్లాస్టిక్ బిందెలను, ఇతర సామన్లను వారానికి ఒకసారి శుభ్రం చేసి ఎండలో కొద్దిసేపు పెట్టడంతో క్రిములు చేరకుండా ఉంటాయని, దీంతో తాగే నీరు కలుషితం కాకుండా ఉంటుందన్నారు. ఇళ్లలోకి దోమలు రాకుండా తలుపులు, కిటికీలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలని అన్నారు.

చెక్‌పోస్టు వద్ద పకడ్బందీగా తనిఖీలు



చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: ఎన్నికల కోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని ఎక్సైజ్ సీఐ నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సీఐ సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు వాహనాలు తనిఖీ చేశారు. కర్నాటక, గోవా నుంచి వచ్చే మద్యం, నగదు, బంగారం తీసుకెళ్లే వారు రశీదులు వెంట ఉంచుకోవాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేని నగదు, బంగారాన్ని సీజ్ చేయాలని సూచించారు. చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాను అమర్చాలని ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి బ్యానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు.

రైతు సంక్షేమమే బీఆర్ఎస్ ధ్యేయం



ధరూరులో మాట్లాడుతున్న బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

ధరూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ అని, బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే 24 గంటల కరెంట్ ఇస్తామని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు 3గంటల కరెంట్, బీజేపీ వస్తే మోటార్లకు మీటర్లు బిగిస్తారని ఏది కావాలో మీరే తేల్చుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపాడు, ఎములోనిపల్లి, చింతరేవుల, భీంపురం, రేవులపల్లి, నర్సన్‌దొడ్డి, వామన్‌పల్లి, జీరబండల, గుడ్డెందొడ్డిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కన్జ్యూమర్ ఫెడరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని కోరారు.

బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల చేరిక

మండలంలోని పారుచర్లకు చెందిన బీజేపీ కార్యకర్తలు కుస్వరాజు, చిన్న రాజు, తిక్కస్వామి, వెంకటన్న, చిన్న రంగన్న, సహదేవులు, కురుమన్న తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే ర్యాలంపాడుకు చెందిన బీజేపీ కో కన్వీనర్ జనార్దన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అలాగే మరల్లపల్లి, కొత్తపల్లికి చెందిన రాముడు, చిన్న రాముడు, జోగి కృష్ణ, నాగరాజు, వెంకట్రాములు, గోవర్ధన్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌లో చేరగా వారికి బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చింతలకుంట బీజేపీ సర్పంచ్ బీఆర్ఎస్‌లోకి

కేటీదొడ్డి మండలం చింతలకుంటకు చెందిన బీజేపీ సర్పంచ్ సువర్ణమ్మ ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బలిగెర బీజేపీ, కాంగ్రెస్ చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు.

ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేరు

కేటీదొడ్డి: ప్రతి పక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా బీఆర్ఎస్ గెలుపును ఆపలేరని బండ్ల జ్యోతి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని యర్సన్‌దొడ్డి, సుల్తానాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బొడ్డెమ్మలు వేసి సంబరాలు చేసుకున్నారు. నాగర్‌దొడ్డి వెంకట్రాములు, జెడ్పీటీసీ రాజశేఖర్ తదితరులు మాట్లాడారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

గట్టు: అభివృద్ధి, సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని, పార్టీని ఆదరించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ జంబురామన్‌గౌడ్, ఎంపీపీ విజయ్‌కుమార్, బండ్ల సాయిసాకేత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మాచర్లలో ఇంటింటికి కృష్ణన్న కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సమస్యను వదిలి ఆర్భాటాలకు ఫోజులా?



మాట్లాడుతున్న కేశవరావ్ తదితరులు

రాజోళి: ఆర్డీఎస్ రైతుల సమస్యలను గాలి వదిలేసి అధికార పార్టీ నాయకులు కేవలం ఆర్భాటాలు మాత్రమే చేస్తున్నారని బీఎస్పీ నాయకుడు కేశవరావు విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఒకవైపు వర్షాలు లేక రైతుల పంటలు ఎండిపోతేంటే వారికి అండగా ఉండి, ఆర్డీఎస్, తుమ్మిళ్ల ద్వారా నీరు అందివ్వాల్సింది పోయి నేను మాత్రమే రైతుల కోసం పోరాడుతున్నానని ఫోజులు ఇస్తున్నారని ఇది సమంజసం కాదని అన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రాజకీయాలను వదిలి, రైతుల కష్టాన్ని మాత్రమే చూడాలని, దానికి అనుగుణంగా అందరూ కలిసి రైతులకు ఏ విధంగా న్యాయం చేయాలో ఆలోచించి, ఆచరణలో పెట్టాలని అన్నారు. త్వరలోనే ఆర్డీఎస్ రైతాంగం కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తామన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా



చింతరేవులలో మాట్లాడుతున్న గొంగళ్ల రంజిత్ కుమార్

ధరూరు: ఒక్క చాన్స్ ఇస్తే గద్వాల కోటపై బహుజన జెండా ఎగరవేద్దామని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్, ఏఐఎఫ్‌బీ ఎమ్మెల్యే అభ్యర్థి గొంగళ్ల రంజిత్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి ఆయన మండలంలోని చింతరేవులలో ఆయా కాలనీల్లో తిరిగారు. తనకు కేటాయించిన సింహం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బడుగు బలహీన వర్గాన్ని బలపరచాలన్నారు. మహనీయులు అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కుతో చరిత్రను తిరగరాద్దామన్నారు. ప్రజల ఆకాంక్ష అయిన విద్య, వైద్యం, సంక్షేమం సాధ్యం కావాలంటే అది రాజ్యాధికారంతోనే సాధ్యవుతుందన్నారు. గద్వాలలో ఒకే కుటుంబ పాలన నాటి నుంచి నేటి వరకు ఏం అభివృద్ధి చేశారో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, లవన్న, గోవిందు, పరశురాం, జగదీష్, మల్దకల్, విష్ణు, ప్రేంరాజ్ తదితరులు పాల్గొన్నారు.